సాక్షి
వరంగల్
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025




సమస్యలు పరిష్కరిస్తాం
జెన్‌కో ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్ల సమస్య సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానీయ అన్నారు. - 8లో



అగ్గి.. అడవి బుగ్గి
ఏజెన్సీలోని అటవీ ప్రాంతంలో వేసవి ఎండలకు తోడు.. కార్చిచ్చు అంటుకోవడంతో అటవీ సమీప గ్రామాలు వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
$34^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.



గుమ్ముడవెల్లి రేణుక (ఫైల్)

నిప్పు కణికలు.. రేణుక రచనలు

- చట్టంపై పట్టుకోసం న్యాయ విద్య..
- విప్లవ ప్రజాపోరాటాల చరిత్ర అక్షరీకరణ
- పలు విప్లవ పత్రికలకు సంపాదకత్వం

మూడు రాష్ట్రాల్లో తూటాలై పేలిన అక్షరాలు

దేవరుప్పుల: ప్రజా చైతన్యానికి ఊపిరిలూదిన జనగామ జిల్లా కడవెండిలో పుట్టిన గుమ్ముడవెల్లి రేణుక అదే పోరాట పంథాను ఎంచుకుని అడవిబాట పట్టింది. చిన్నతనంలోనే వివాహం, తదితర ఘటనలు ఆమెను తీవ్రంగా కలిచివేశాయి. ఈనేపథ్యంలో చట్టంపై అవగాహన కోసం న్యాయ విద్యను అభ్యసించింది. ఆమె సోదరుడు ప్రసాద్ అలియాస్ ఉసెండి దండకారణ్యంలో పనిచేసేవాడు. ఈక్రమంలో పోలీసుల అత్యంత నిర్బంధాలను చవిచూసిన తండ్రి సోమయ్య.. కూతురు రేణుకకు యుక్త వయసు రాగానే ఉన్నత చదువులకు అవకాశం ఇవ్వకుండా ఓ వ్యక్తితో వివాహం చేశారు. దీంతో వారి దాంపత్య జీవితంలో పురుషాధిక్యత వంటి అంశాలతో కలహాలు వచ్చాయి. అనివార్యంగా విడాకులు తీసుకోవాల్సి వచ్చింది. యుక్తవయస్సు రాగానే తన ఆలోచనలకు విరుద్ధంగా పితృస్వామ్య వ్యవస్థలో నిర్ణయాలు, అజమాయిషీపై ఆమె తీవ్రంగా ఆలోచించింది. ఈనేపథ్యంలోనే ఓయూలో దూరవిద్యలో డిగ్రీ చేసి చట్టంపై పట్టు కోసం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ చదివింది.

ఎల్‌ఎల్‌బీ చదువుతున్న క్రమంలోనే..


రేణుక లా చదువుతున్న సమయంలో అప్పటికే ఉద్యమంలో ఉన్న పద్మక్క, సూర్యం పరిచయమయ్యారు. దీంతో ఆమె ఆలోచనాత్మక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రజాసంఘాల్లో భాగస్వామ్యమవుతూ దండకారణ్యం బాట పట్టింది. వరుస ఎన్‌కౌంటర్లు, నిర్బంధ పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ నిర్ణయంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాక్షేత్రంలో చోటుచేసుకున్న అనేక కీలక ఘటనలు, ఘట్టాలపై విశ్లేషణాత్మక అధ్యయనాలు చేసి పార్టీకి మార్గదర్శకాలు చేసింది. అజ్ఞాత జీవితాన్ని ఎదుర్కొంటూనే విప్లవ ప్రజాపోరాటాల చరిత్రను అక్షరీకరించింది. నక్సల్స్ తరఫున ప్రభాత్, మహిళా మార్గం, అవామి జంగ్, పీపుల్స్ మార్చ్, పోటియారో పోల్లో, సంఘర్షణ్, భూమ్కల్ సందేశ్, పితురీ వంటి విప్లవ పత్రికలకు సంపాదకత్వం వహించింది. తొలుత భాషాధార(బీడీ) ప్రాంతంలో పని చేసే క్రమంలో బీడీ దమయంతి పేరుతో రచనలు చేసింది.

కడవెండి పడమటి తోట.. నక్సల్స్ ఉద్యమానికి బాట - వివరాలు 8లో

కడవెండికి చేరిన రేణుక మృతదేహం

క్షేత్రస్థాయి పరిస్థితులపై విశ్లేషణాత్మకంగా..

1994లో తాను ఎదుర్కొన్న సంఘర్షణను బట్టి 'మహిళలపై హింస–మండుటెండు గాయాలు' రచన చేసింది. పత్రికల్లో బీడీ దమయంతి పేరిట సల్వాజుడుం విధ్వంసం తీరుపై 'పచ్చని బతుకుల్లో కురుస్తున్న నిప్పులు', ఆదివాసీ భూపోరాటాల విజయపథంలో 'విముక్తి బాటలో నారాయణఖేడ్', భూఆక్రమణలు చేపడుతూ వడ్డీ వ్యాపారుల ఆగడాలు, ఆదివాసీ, దళితుల మధ్య పాలకుల చిచ్చు అంశాలపై మీడియా రూపంలో క్షేత్ర స్థాయిలో విశ్లేషణాత్మక అధ్యయనాలు చేసి మావోయిస్టు అగ్రనేత రామకృష్ణతో పర్యటన చేసింది. సింగన్‌మడుగు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట అడవిలో ఆరు ఊర్లను తగులబెట్టిన నేపథ్యంపై ఆమె చేసిన రచనలు తుపాకీ తూటాల కంటే రెట్టింపులో పేలి ప్రజాచైతన్యానికి ఊపిరిలూదినట్లు చెబుతుంటారు. యుక్త వయసులో ఓ ఇంటి ఆవిడగా సంఘర్షణ పడి సమ సమాజ స్థాపన కోసం అడవిబాట పట్టిన ఉద్యమ కెరటం రేణుక ప్రస్థానం దంతెవాడ ఎన్‌కౌంటర్‌తో ముగిసినా మెట్లమీద మిడ్కో(మిణుగురు పువ్వు) పేరిట ఆమె రచనలు, సాహిత్యం ఎప్పటికీ గుర్తుండిపోతుందని సాహిత్యాభిమానులు అంటున్నారు.



మిడ్కో కథలు (మెట్ల మీద)

న్యూస్‌రీల్

ఆరోగ్య లక్ష్యాలను చేరుకోవాలి

- డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



గీసుకొండ: ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య లక్ష్యాలను చేరుకోవడానికి వ్యాధినిరోధక టీకాలు, ఆస్పత్రి ప్రసవాలు, మాతా శిశు సంరక్షణ చేపట్టాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్‌లోని కీర్తినగర్ హౌసింగ్ కాలనీలోని యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. డాక్టర్ జాబిలి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సిబ్బంది నాగరాజు, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.


పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

వరంగల్: జిల్లాలో పదోన్నతి పొందిన పీజీహెచ్‌ఎంలు, వివిధ సబ్జెక్టులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల(పీడీ)కు 3, 4 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మూడు(3)కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 472 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని, శిక్షణ పొందే ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేసి శిక్షణకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కరీమాబాద్ ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలలో తెలుగు(117 మంది), హిందీ(97) ఉపాధ్యాయులకు, రంగశాయిపేట ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్(14), మ్యాథ్స్(21), సోషల్(46) ఉపాధ్యాయులు, శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంలు(30), ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు(63), సైన్స్(29), పీడీలు(52)మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణా కేంద్రాలకు ఉపాధ్యాయులందరూ తమ టెక్స్ట్ బుక్స్ తీసుకుని ఉదయం 9 గంటల వరకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. తెలుగు, హిందీ సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు మాత్రమే ఒకరోజు శిక్షణ ఉంటుందని, మిగతా సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని డీఈఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ ఏసీపీగా పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఖమ్మంలో సైబర్ క్రైమ్ ఏసీపీగా పనిచేస్తున్న ఫణీందర్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వస్తున్నారు.

నియామకం



మేరుగు రమేశ్

గీసుకొండ: మండలంలోని మనుగొండకు చెందిన మేరుగు రమేశ్ తెలంగాణ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

- **మార్చి 30:** ఖిలావరంగల్ మండలం దూపకుంటలో 3,504 గజాలు ఉన్న సంపత్ కుమార్‌కు రూ.11,75,308 ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు అయ్యాయి.. వీటిలో 25 శాతం (రూ.2,93,827) పోనూ రూ.8,80,481 చెల్లించాలని ఆయన మొబైల్‌కు ఉగాది పండుగ రోజు ఎస్ఎంఎస్ వచ్చింది. అయితే 30న ఉగాది కావడంతో బ్యాంకులు పనిచేయకపోవడంతో అంత మొత్తంలో డబ్బు కట్టడం అతడివల్ల కాలేదు. పండుగరోజు డబ్బులు ఎలా కట్టడమని ఆయన తలపట్టుకున్నాడు.
- **ఏప్రిల్ ఒకటి:** ఖిలా వరంగల్ మండలం ఏనుమాముల రెవెన్యూ గ్రామంలో ఓం ప్రకాశ్‌కు ఉన్న 735 గజాల ఓపెన్ ప్లాట్ క్రమద్ధీకరణ కోసం 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈపడాది మార్చి31వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపుపై 25శాతం ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో చెల్లిద్దామనుకున్నాడు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఇంటిమేషన్ ఎప్పుడూ వస్తుందా? అని ఎదురుచూశాడు. తీరిగ్గా ఏప్రిల్ ఒకటిన రూ.2,46,533 చెల్లించాలంటూ ఎస్ఎంఎస్ వచ్చింది.
- **అసలే రాలేదు:** వరంగల్ మండలంలోని పైడిపల్లిలో 200 గజాలున్న ఎస్.విపులకు ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఇంటిమేషన్ రాలేదు. ఆమె ప్లాట్ సమీపంలో చెరువులు, కుంటలు లేవు. అయినప్పటికీ ఆ ప్లాట్‌కు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాకపోవడంతో ఆమె అయోమయంలో ఉన్నారు. తన చుట్టుపక్కల ఒకరిద్దరికీ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు వచ్చాయి. సాంకేతిక కారణాలతో ఫీజు జనరేట్ కాలేదని బల్దియా అధికారులు సమాధానమిస్తున్నారు.

గందరగోళం!

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ఆగమాగం

- ఉగాది రోజూ కొందరికి ఫీజు ఇంటిమేషన్
- మరికొందరికి ఏప్రిల్ ఒకటిన మెసేజ్‌లు
- ఇప్పటికే ఇష్టారీతిన చార్జీల వడ్డింపు
- మార్చి 31తో 25 శాతం రాయితీ గడువు ముగింపు
- అధికారుల తీరుతో దరఖాస్తుదారులకు నష్టం



సాక్షి, వరంగల్:

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ఫీజుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల విషయంలో ఇష్టారీతినచార్జీలు విధించిన ఘటనలు వెలుగు చూడగా.. తాజాగా అసలు ఫీజు ఇంటిమేషన్ రాని వాళ్లు కూడా చాలా మంది ఉండడంతో అధికారుల పనితీరుపై ఆరోపణలు వస్తున్నాయి. మార్చి31వరకు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని ప్రభుత్వం జీఓ తీసుకొచ్చినా..అధికారుల అలసత్వం కారణంగా ఉగాది పండుగైనప్పటికీ మార్చి 30న కూడా ఫీజు చెల్లించాలంటూ వందలాది మందికి ఎస్ఎంఎస్‌లు వచ్చాయి. ఆరోజు పండుగ కావడంతో ఫీజు ఎక్కడ చెల్లించేదని, బ్యాంకులు పనిచేయకపోవడంతో ఆ రాయితీ ఇక తమకు వర్తించదా? అని వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇంకొందరికి ఏప్రిల్1న ఫీజు ఇంటిమేషన్ రావడంతో మార్చి 31వరకు ఉన్న 25శాతం రాయితీ తమకు వర్తించదా?అన్న ఆందోళనలో ఉన్నారు.ఇవన్నీ ఒక ఎత్తయితే ఇంకా ఫీజుకు సంబంధించి ఎస్ఎంఎస్‌లు రాని వారు కూడా చాలామంది ఉండడం బల్దియా అధికారుల పని తీరుకు అద్దం పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

మా పరిధి కాదు: అధికారులు

ఫీజు ఖరారు తమ పరిధిలో లేదని, అదంతా కంప్యూటర్ జనరేటెడ్ బిల్స్ అని బల్దియా కార్యాలయానికి వచ్చి వెళ్తున్న దరఖాస్తుదారులకు టౌన్ ప్లానింగ్ అధికారులు సమాధానం చెబుతున్నారు. కొందరికి ఫీజు చెల్లించాలంటూ సమాచారం ఇచ్చి, తమకు ఎందుకు ఇవ్వలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల తీరుతో తాము రాయితీ అవకాశాన్ని కోల్పోయామని మరికొందరు ఆందోళన చెందుతున్నారు. రాయితీ గడువు పొడిగించాలనే డిమాండ్ దరఖాస్తుదారుల నుంచి వినిపిస్తోంది.

బల్దియా లెక్క ఇలా..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 1.10 లక్షల దరఖాస్తుల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 65 వేల దరఖాస్తులు అర్హత సాధించాయి. వీటిలో 15 వేల మంది దరఖాస్తుదారులు ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు పొందేటప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం 14 శాతం చెల్లించారు. మరో 15 వేల అర్జీలు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే సుమారు 35 వేల దరఖాస్తుల ద్వారా రూ.200 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. సోమవారం రాత్రి వరకు 14 వేల మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించడంతో రూ.94 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది.

సమస్య కలెక్టర్ల దృష్టికి..

ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తుదారులకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వరంగల్, హనుమకొండ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లామని, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులకు కూడా వివరించామని 'కుడా' లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, మహ్మద్ సుల్తాన్ తెలిపారు. గతంలో ఎన్నికల కోడ్ కారణంగా చాలారోజులు 25 శాతం రాయితీ వరంగల్, హనుమకొండ వాసులకు వర్తించలేదని, అధికారులకు ఎడిట్ ఆప్షన్ కూడా వారం కిందటే ఇవ్వడంతో ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఇంటిమేషన్లు వస్తున్నాయని వివరించారు. మార్చి 31తో ముగిసినా 25 శాతం రాయితీని మరికొద్ది రోజులు పెంచాల్సిన అవసరముందని అధికారులకు వివరించినట్లు తెలిపారు.

ఏం చేయాలంటే...

- 2020 ఆగస్టు 31కి ముందు కొనుగోలు చేసిన సేల్ డీడ్ ప్రకారమే ఆయా ప్లాట్ల విస్తీర్ణం ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు విధించాల్సి ఉండగా.. తాజా మార్కెట్ వాల్యూకు మూడింతలు చార్జీలు విధిస్తుండడంతో రూ.లక్షల్లో చార్జీలు వచ్చి అయోమయంలో ఉన్నారు.
- టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎడిట్ ఆప్షన్ వచ్చి వారం రోజులు దాటుతున్నా ఇప్పటికీ కరెక్షన్ చేసి ఫీజు ఎస్ఎంఎస్‌లు పంపేవి చాలానే ఉన్నాయన్న టాక్ ఉంది.దీనిపై ఆ విభాగ ఉన్నతాధికారుల నుంచి సరైన స్పష్టత రావట్లేదు.
- మార్చి 30 (ఉగాది రోజు)న ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు వచ్చిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీ వర్తించేలా చూడాలి. ఎందుకంటే ఆ రోజు బ్యాంకు కార్యకలాపాలు లేవు.
- ఇప్పటికీ ఫీజు ఇంటిమేషన్ రాని వారికి కూడా ఈ రాయితీ ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈవిషయాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ విభాగ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ వర్గాల బాహాబాహీ



ఇసుక కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

- ఇల్లందలో ఫ్లెక్సీ ఫొటో వివాదంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- పెట్రోల్ డబ్బాతో ఇసుక కూలీ ఆత్మహత్యాయత్నం
- పట్టించుకోకుండా వెళ్లిపోయాడని ఎమ్మెల్యే నాగరాజుపై కూలీల ఆగ్రహం

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామంలో మంగళవారం నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇరు వర్గాలుగా విడిపోయి బాహా బాహీగా తలపడ్డారు. ఎమ్మెల్యే నాగరాజు వచ్చే ముందు గ్రామంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భానుప్రసాద్ డీజే పాటలు పెట్టే ప్రయత్నం చేస్తుండగా గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. డీజే ఎవరిని అడిగి పెట్టావని భానుతో వాగ్వాదానికి దిగాడు. కనీసం ఫ్లెక్సీలో తన ఫొటో పెట్టలేదని దూషించాడు. దీంతో తాళ్లపెల్లి శ్రీనివాస్, పోశాల వెంకన్న తదితరులు భాను వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి కాలర్ పట్టుకుని నెట్టేసుకుంటూ భాను ఆగ్రహంతో ఊగిపోతుండగా బండౌతపురం మాజీ సర్పంచ్ భర్త సాయి సముదాయించే ప్రయత్నం చేశాడు. నన్నే అడ్డుకుంటావా అంటూ అతనితో భాను వాగ్వాదానికి దిగాడు. దీంతో నాయకులు కార్యకర్తలు గందరగోళానికి గురయ్యారు. ఒకరినొకరు నెట్టేసుకునే స్థాయికి దిగారు. ఈక్రమంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ దామోదర్.. పత్రి భానును పక్కకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా నాపైనే చేయి వేస్తావా.. అంటూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి తిరిగివెళ్తున్న క్రమంలో.. ఇసుక రవాణా నిలిపివేయడంతో తాము ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేను అడిగేందుకు ఇసుక కూలీలు, ట్రాక్టర్ యజమానులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ అంశం తన పరిధిలో లేదని.. మంత్రి కొండా సురేఖ పరిధిలో ఉందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అయినా కూలీలు, ట్రాక్టర్ యజమానులు తమ బాధను వినాలని తమకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యేను నిలదీసే ప్రయత్నం చేశారు. ఆయన నిరాకరిస్తూ తన కారును ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే నాగరాజు తీరు సరిగాలేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలా చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై కూలీలు, యజమానులు రాస్తారోకో చేసిన నిరసన తెలిపారు. ఇంతలో ఓ ఇసుక కూలీ.. పెట్రోల్ శరీరంపై పోసుకునే ఆత్మహత్యాయత్నం చేస్తుండగా పోలీసులు అప్రమత్తమై.. పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సంగెంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం/గీసుకొండ: పేదల ఆహారభద్రతకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని దారిద్రరేఖకు దిగువనున్నవారికి సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మక ఘట్టమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సంగెం, గీసుకొండ మండలాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని భవిష్యత్‌లో ఏ ప్రభుత్వం మార్చే ధైర్యం చేయదన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యం అందిస్తున్న ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. ఇక కొత్తకార్డులు ఇవ్వబోతున్నట్లు చెప్పారు. గతంలో దొడ్డుబియ్యం వల్ల రేషన్ పక్కదారి పట్టి దళారులు, కోళ్లఫారాల పాలయ్యాయని, ఇక సన్న బియ్యాన్ని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ప్రతి స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలికి త్వరలో నాణ్యమైన రెండు చీరలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గంలో మొత్తం 17,500లకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, సివిల్ సప్లయీస్ డీటీ మధుసూదన్, గీసుకొండలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్డీఓ సత్యపాల్, ఏపీఎం సురేశ్‌కుమార్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, రేషన్ డీలర్ కుమారస్వామి, బీమగాని సౌజన్య, చాడ కొమురారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి

- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ అంకిత్‌కుమార్


పర్వతగిరి: పోలీసులు సాయంత్రం వేళల్లో గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ సూచించారు. ఈ మేరకు పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో రౌడీ షీటర్లను చెకింగ్ చేయాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి, సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభపై సమీక్ష



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి జిల్లా నేతలు సమావేశమయ్యారు. సమావేశంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, రెడ్యా నాయక్, శంకర్ నాయక్, గండ్ర వెంకట రమణారెడ్డి, నన్నపునేని నరేందర్, నాయకులు లక్ష్మణ్‌రావు, గండ్ర జ్యోతి, నాగజ్యోతి పాల్గొన్నారు.

ఎంపిక



శ్రవణ్‌కుమార్

నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన బూర్గుపల్లి శ్రవణ్‌కుమార్ భారత వినియోగదారుల సమాఖ్య కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పదేళ్లకు పైగా, వినియోగదారుల మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసినట్లు పేర్కొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం గులాబీ రంగు గన్నేరు పూలతో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు భద్రకాళి శేష ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు గులాబీ రంగు గన్నేరు పూలకు సంప్రోక్షణ నిర్వహించి వాటితో అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు.

క్లుప్తంగా

పోలీస్ కస్టడీకి రాజలింగమూర్తి హత్య నిందితులు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఫ్రిబవరి 19న జరిగిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు నిందితులను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. రేణుకుంట్ల సంజీవ్, పింగిళి సీమంత్, మోరె కుమార్, దాసారపు కృష్ణ, కొత్త హరిబాబును నేటి(బుధవారం) నుంచి ఈ నెల 4వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు, సమాచారం కోసం వీరిని భూపాలపల్లి పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు.

32.750 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు ఒడిశా వాసుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వర్ధన్నపేట: వర్ధన్నపేట బస్టాండ్ సమీపం ఎస్‌బీఐ వద్ద 32.750 కేజీల గంజాయి పట్టుకుని ఇద్దరు ఒడిశా వాసులను అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం వర్ధన్నపేట బస్టాండ్ సమీపం ఎస్‌బీఐ వద్ద ఇద్దరు అనుమానస్పదంగా ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లి తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాలోని గంజాం జిల్లా జ్యోతినగర్‌కు చెందిన సామ్సంగ్ దళ బెహరా, మరొకరు జ్యోతి నగర్ సురడకు చెందిన మార్తో రోహితోగా తెలిసింది. స్మగ్లర్ నయోని అనే మహిళ ద్వారా సామ్సంగ్ దళ బెహరా, మార్తో రోహితో గంజాయి రవాణా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన గంజాయి తీసుకుని ఒడిశాలోని చత్రాపూర్ వద్ద గత నెల 28వ తేదీన రాత్రి పూరి – తిరుపతి రైలు ఎక్కి 29న మధ్యాహ్నం విజయవాడ వద్ద దిగారు. సాయంత్రం 4 గంటలకు విజయవాడ– అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి సూరత్ వెళ్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు బోగీలు తనిఖీ చేస్తున్నారు. దీంతో బయపడి రైలు దిగి వరంగల్ బస్టాండ్ సమీపంలో రాత్రి గడిపారు. పోలీసుల భయంతో రెండు రోజులు వరంగల్‌లోనే గడిపిన అనంతరం మంగళవారం వర్ధన్నపేటకు చేరుకున్నారు. తిరిగి వరంగల్ వెళ్లడానికి బస్సు కోసం వర్ధన్నపేట ఎస్‌బీఐ ఎదుట వేచి చూస్తున్న సమయంలో వారిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నర్సయ్య తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గి.. అడవి బుగ్గి

కార్చిచ్చుతో వేసవిలో వేడెక్కుతున్న ఏజెన్సీ గ్రామాలు



రాత్రి దీపాల వరుసలా దగ్ధమవుతున్న అడవి

- ఎక్కడ చూసినా కాలుతున్న అడవి
- కమ్ముకుంటున్న పొగ..అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు, వన్యప్రాణులు



మంటలు ఆర్పుతున్న అటవీ శాఖ అధికారులు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాలు అనగానే పచ్చని అడవి, ఎత్తైన గుట్టలు, వాగులు, వంకలు, అహ్లాదకర వాతావరణం గుర్తుకువస్తుంది. కానీ వేసవిలో మాత్రం ఆ గ్రామాలు వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతాయి. ఎండాకాలంలో అడవి మొత్తం ఆకు రాల్చి మోడులా మారుతుంది. దీంతో ఎక్కడ చిన్న అగ్గి రవ్వ తగిలినా దావానలంలా విస్తరించి అడవినంతా దహించి వేస్తుంది. ఫలితంగా అడవి అంతా మంటలు వ్యాపించి పొగ కమ్ముకుని కనిపిస్తుంది. అసలే భానుడి వేడికి తోడు కార్చిచు మంటలు అంటుకోవడంతో ఇక్కడ వాతావరణం మిగతా ప్రాంతాలకంటే అధిక వేడిని కలిగి ఉంటుంది. మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు,బయ్యారం, వరంగల్‌జిల్లాలోని ఖానాపురం, ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, మల్లంపల్లి మండలాల్లో ఈ పరిస్థితి ఉంటుంది.

అల్లాడుతున్న వన్యప్రాణులు

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. వన్య ప్రాణులు, పక్షులకు నీరు లభించడం చాలా కష్టం. దీనికి తోడు అడవులు కాలుతుండడంతో వాటి గూడు చెదిరిపోతుంది. పక్షులు అడవిలో ఉండలేక వేడి వాతావరణాన్ని తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. మంటల నుంచి తప్పించుకుని వన్యప్రాణులు జనావాసాల్లోకి, పంట పొలాల వద్దకు వచ్చి వేటగాళ్ల ఉచ్చుల్లో పడుతున్నాయి. దీంతో పాటు విలువైన ఆయుర్వేద మొక్కలు అంతరించిపోతున్నాయి.

మంటలు ఆర్పడం సిబ్బందికి సవాలు

అడవుల్లో మంటలు ఆర్పడం అటవీ శాఖ సిబ్బందికి సవాలుగా మారుతోంది. ప్రభుత్వం మంటలార్పేందుకు అధునాతన మిషన్లు, నిధులు సమకూర్చినా క్షేత్ర స్థాయిలో ఇబ్బందులే ఎదురవుతున్నాయి. రాత్రి పూట మంటలు అంటుకున్న సమయంలో ఆర్పడం సిబ్బందికి సాధ్యం కావడం లేదు. తెల్లవారే సరికి తీవ్ర నష్టం జరుగుతోంది. అడవుల్లో మంటలు విస్తరించకుండా వేసవికి ముందే కాలి బాటలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తీరా మంటలు అంటుకున్న తర్వాతే సిబ్బంది స్పందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అడవిలో మంటలకు తునికాకు కాంట్రాక్టర్లలే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తునికాకు మోడెం కొట్టకుండా అడవులకు నిప్పు పెడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అటవీ దహనాలకు పాల్పడితే చర్యలు

అటవీ దహనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మంటలు విస్తరించకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పశువుల కాపరులు, మోడెం కొట్టె కూలీలు అటవీ దహనాలకు కారకులుగా భావించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వన్య ప్రాణులు వేటకు గురికాకుండా సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేయిస్తున్నాం.

– చంద్ర శేఖర్, సబ్ డీఎఫ్‌ఓ

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

మానుకోట మున్సిపాలిటీ పరిధి బోరింగ్‌తండా సమీపంలో ఘటన

ఘటనా స్థలిని సందర్శించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



పార్థసారథి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఓ గురుకులంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ పి.సర్వయ్య కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన తాటి పార్థసారథి (42) భద్రాచలంలోని జగదీశ్ కాలనీలో నివాసముంటున్నాడు. 11 ఏళ్ల క్రితం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రేకపల్లే గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. వారికి పిల్లలు భార్గవ్‌సాయి, పరమేశ్వరి ఉన్నారు. పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఏడాది కాలంగా హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య స్వప్న, పిల్లలు భార్గవ్‌సాయి, పరమేశ్వరి భద్రాచలంలోని జగదీశ్ కాలనీలో ఉంటున్నారు. పార్థసారథి మాత్రం దంతాపల్లి మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ సెలవు రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం భద్రాచలం వెళ్లి సోమవారం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరాడు. తాను వస్తున్నానని తన గది యజమానికి ఫోన్ చేసి ఇంటి గేటు వేయొద్దని చెప్పాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున బోరింగ్‌తండా సమీపంలోని మిరప చేనులో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానిక రైతులు గమనించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం తెలిపారు. దీంతో రూరల్ ఎస్సై వి.దీపిక, సీఐ పి.సర్వయ్య, డీఎస్పీ ఎన్.తిరుపతిరావు ఘటనా స్థలిని పరిశీలించి ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు సమాచారం ఇవ్వగా ఆయన హుటాహుటిన చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్స్, క్లూస్‌టీం బృందాలు వివరాలు సేకరించాయి. ఘటనాస్థలికి చేరుకున్న మృతుడి సోదరి మద్దుల హేమవరలక్ష్మి, బావ శివప్రసాద్ బోరున విలపించారు. హేమవరలక్ష్మి మాట్లాడుతూ.. తన సోదరుడు పార్థసారథిపై ఏడాది క్రితం దాడి జరిగిందని తెలిపారు. మరదలు స్వప్నకు వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఈ కారణంగానే తమ సోదరుడి హత్య జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. కాగా, పోలీస్ స్టేషన్‌లో పార్థసారథిని దుండగులు హత్య చేసి చంపారని ఫిర్యాదు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల ఆర్‌సీఓ రాజ్‌కుమార్.. పార్థసారథి హత్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, సీసీఎస్ సీఐ హథీరాం, ఇతర పోలీసుల అధికారులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్

కీలకం కానున్న హెల్మెట్..

పార్థసారథి హత్య విషయంలో ఘటనా స్థలిలో లభ్యమైన హెల్మెట్ కీలకం కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుల రాకపోకలు, వాళ్లు వాడిన ద్విచక్రవాహనం ఆచూకీ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ ఫుటేజీల్లో నిందితులు హత్య చేయడానికి వచ్చే ముందు ఆ వాహనం నడిపిన వ్యక్తి ధరించిన హెల్మెట్ తెలుపురంగులో ఉండగా, ఘటనా స్థలిలో లభించిన హెల్మెట్ కూడా అదే రంగులో ఉండడం గమనార్హం. పార్థసారథి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. భద్రాచలం నుంచి హత్య జరిగిన ప్రాంతం వరకు రహదారుల వెంట ఉన్న సీసీ ఫుటేజీని పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

గురుకుల పాఠశాలలో విషాదఛాయలు

దంతాలపల్లి : మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో విషాదఛాయలు అలుముకున్నాయి, పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న తాటి పార్థసారథి జిల్లా కేంద్రం సమీపంలో దారుణ హత్యకు గురైన విషయం విధితమే. ఈ ఘటనపై విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పార్థసారథి విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం జాగ్రత్తలు తీసుకునేవారని, పాఠశాలకు సంబంధించిన ప్రతీ పనిని అంకితభావంతో చేసేవారని విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. నిబద్ధత గల ఉద్యోగిని కోల్పోయామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

జీజీహెచ్‌లో శిశువు మృతి



ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, బంధువులు, గిరిజన సంఘాల నాయకులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నవజాత శిశువు మృతి చెందింది. అయితే ఈ ఘటనకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలం శనిగపురం శివారు భట్టుతండాకు చెందిన బానోత్ జయశ్రీకి రెండో కాన్పులో పురిటి నొప్పులు రాగా సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో తెల్లవారుజామున 4 గంటలకు వైద్యులు ఆపరేషన్ చేశారు. జయశ్రీ మగశిశువుకు జన్మనివ్వగా ఆ శిశువు మృతి చెందాడు. అయితే తీసుకొచ్చిన వెంటనే చేయకుండా 4 గంటల తర్వాత ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి చెందాడని, దీనికి వైద్యులు నిర్లక్ష్యం కారణమని మండిపడ్డారు.

రోడ్డుపై బైఠాయించి ఆందోళన..

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని, ఈ ఘటనలో వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గిరిజన సంఘాల నేతలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. జయశ్రీ నాలుగు గంటల పాటు పురిటి నొప్పులతో బాధపడుతుందని చెప్పినా ఆస్పత్రిలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. కేవలం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందాడని ఆరోపించారు. టౌన్ సీఐ దేవేందర్ రాస్తారోకో వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

వరి పంట ఎండిందనే మనస్తాపంతో ..

- ఆత్మహత్యకు యత్నించిన రైతు
- చికిత్స పొందుతూ మృతి
- రామచంద్రాపురంలో ఘటన



మహేశ్ (ఫైల్)

బచ్చన్నపేట : ఒక పక్క కూతురు పెళ్లికి చేసిన అప్పు.. మరో పక్క భూగర్భ జలాలు అడుగంటి బోరు నుంచి సరిగా నీరు రాకపోవడంతో ఎండిన ఎకరం వరి పంట.. ఈ కారణాలతో మనోవేదనకు గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్‌కే హమీద్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఒగ్గు మహేశ్ (42) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం అప్పు చేసి కూతురు వివాహం చేశాడు. ఇటీవల తన కున్న ఒక ఎకరం భూమిలో వరి పంట సాగు చేశాడు. అయితే భూగర్భ జలాలు అడుగంటి బోరు సరిగా నీరు పోయకపోవడంతో ఆ పంట ఎండిపోయింది. దీంతో కూతురు పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలని, వరి పంట కూడా ఎండిపోయిందని మనోవేదనకు గురైన మహేశ్ గత నెల 29వ తేదీన తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హమీద్ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

- తప్పిన పెను ప్రమాదం..
- మానేరు బ్రిడ్జి వద్ద ఘటన


మల్హర్ : ప్రమాదవశాత్తు ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కొయ్యూరు పీవీనగర్ అడవి సోమన్‌పల్లి మానేరు బ్రిడ్జి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. టీఎస్18సీ 2008 నంబర్ గల కారు భూపాలపల్లి నుంచి మంథని వైపునకు వెళ్తుంది. ఈక్రమంలో కొయ్యూరు పీవీనగర్ సమీపంలోని మానేరు బ్రిడ్జి వద్ద పొగలు రావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు గమనించి కిందికి దిగారు. ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో వారు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురు పొగలు రావడం గమనించి కిందకి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



కారు నుంచి చెలరేగుతున్న మంటలు

డేంజర్ జోన్ సమస్యలు పరిష్కరిస్తాం

- జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా



ఓపెన్‌కాస్ట్ వ్యూ పరిశీలిస్తున్న సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా

మల్హర్: జెన్‌కో ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్ల సమస్య సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును మంగళవారం సందర్శించారు. ఓపెన్‌కాస్ట్ మైన్ లోపల పర్యటించి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న పని తీరు, ఓపెన్‌కాస్ట్ వ్యూప్యాంట్ ద్వారా డేంజర్ జోన్ ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఏఎమ్మార్ క్యాంపు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024–25లో నిర్దేశించిన లక్ష్యాన్ని ఏఎమ్మార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం 25లక్షల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేరుకోవడంపై వారిని అభినందించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. జెన్‌కో పరిధిలోని భూ నిర్వాసితులు సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామని, నిర్వాసితులు ఆందోళన చెందొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఎమ్మార్ ఎండీ మహేశ్‌రెడ్డి, సీఈఓ డీఎల్ఆర్‌కే ప్రసాద్, జెన్‌కో డైరెక్టర్లు లక్ష్మయ్య, కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్, జెన్‌కో ఏజెంట్ జీవన్ కుమార్, జీఎం మోహన్‌రావు, అడిషనల్ కలెక్టర్ అశోకుమార్, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్లు విశ్వనాథ్‌రాజు, శ్రీధర్, ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా, జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియాకు పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లోని ఇళ్ల సమస్య పరిష్కరించాలని కోరుతూ నిర్వాసితులు తాండ్ర మల్లేశ్, ఇందారపు చంద్రయ్య, అశోక్‌రావు, రాజు, మొగిళి తదితరులు వినతిపత్రం అందజేశారు.

కడవెండి పడమటి తోట.. నక్సల్స్ ఉద్యమానికి బాట

- రాడికల్ స్టూడెంట్స్ పల్లె క్యాంపెయిన్‌లతో చైతన్యం
- సామాజిక వైరుధ్యాలను అధిగమిస్తూ ఐక్యతారాగం
- పోరాట ఫలితంగా నక్సల్స్‌బరి వైపు అడుగులు
- కడవెండి మదిలో అమరుల పోరాట స్మృతులు



కడవెండిలో నాలుగు దశాబ్దాల క్రితం సాధించుకున్న నివాసిత ప్రాంతం పడమటితోట

దేవరుప్పుల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో విస్నూర్ దేశ్‌ముఖ్‌లను ఎదురించి భూమి.. భుక్తి.. బానిస బంధాల విముక్తి పొందిన కడవెండి ప్రజలు నిలువ నీడ కోసం చేసిన పడమటి తోట ఇళ్ల స్థలాల పోరాటం.. నక్సల్స్ ఉద్యమానికి బాట అయ్యింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1980లో వామపక్ష పార్టీల నేతృత్వంలో స్థానిక భూస్వామి అస్నాల రాజయ్యకు చెందిన పడమటి తోటలో బీసీ సామాజికవర్గ పేదలు గుడిసెలు వేశారు. ఈ పోరాటానికి తొలుత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన నల్లా నర్సింహులు నేతృత్వం వహించినప్పటికీ సఫలీకృతం కాలేదు. ఈ తరుణంలో కొత్తగా ఆవిర్భవించిన సీపీఐ(ఎంఎల్) నాయకుడు అంజాజీ నేతృత్వం వహించారు. ఈ తరుణంలోనూ సదరు భూస్వామి ఎస్సీ, ఎస్టీలను పురమాయించి ఈ పోరాటానికి చెక్ పెట్టేందుకు యత్నించారు. దీంతో భూపోరాటం నిర్వీర్యమయ్యే క్రమంలో 1982లో రాడికల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో వేసవిలో పల్లె క్యాంపెయిన్‌లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పటికే 'లా' విద్యనభ్యసిస్తున్న ఎర్రంరెడ్డి పురుషోత్తంరెడ్డి నివాసిత భూపోరాట విజయం కోసం ఆర్‌ఎస్‌యూ పక్షాన పావులు కదిపారు. ఎస్సీ, ఎస్టీలను చైతన్య పరుచడంతో పడమటి తోట పోరాటానికి వారు సంఘీభావం పలికారు. దీంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ విషయంలో అనేక మందిపై కేసులు నమోదైనా పోరాటం తగ్గలేదు. దీంతో భూ యజమాని దిగొచ్చి కేసులు ఉపసంహరించుకున్నారు. నల్లా నర్సింహులు ఉద్యమ స్ఫూర్తితో అతడి తమ్ముడు నల్ల మల్లయ్య, బావమరిది బిట్ల ముత్తయ్య పడమటి తోట సాధించుకునేందుకు దోహదపడ్డారని పురుషోత్తం రెడ్డి పేర్కొనడం గమనార్హం.

పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాణంలో గ్రామస్తుల కీలక పాత్ర..

ఐక్యంగా నిలువ నీడలేని పేదలకు స్థలాల సాధనతో స్థానిక స్టూడెంట్స్, యువత రాడికల్ సంఘం వైపు ఆకర్షితులై రాష్ట్ర ఉత్తర తెలంగాణ స్థాయి పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాణంలో గ్రామస్తులు కీలక పాత్ర పోషించేలా ఎదిగారు. ఈ క్రమంలోనే పీపుల్స్ వార్ నాయకులు తుపాకులు చేతబూని సింగిల్ ఆర్గనైజర్ వ్యవస్థ విస్తరించే క్రమంలో ఇళ్ల స్థలాల పోరాట నేపథ్యంలో జనశక్తి, పీపుల్స్‌వార్ మధ్య వైరుధ్యం పెరిగింది. దీంతో ఆధిపత్యం కోసం పురుషోత్తంరెడ్డి అలియాస్ ఎపీకి బదులు పీపుల్స్ వార్‌కు సహకరిస్తున్నాడనే కారణంతో సీతారాంపురంలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఎర్రంరెడ్డి సోమిరెడ్డిని జనశక్తి నక్సల్స్ కాల్చి చంపారు. ఈ ఘటనతో పరిస్థితి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైన క్రమంలోనే పురుషోత్తం రెడ్డి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా, అతడి సోదరుడు ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి ఉస్మానియా విద్యాలయం వేదికగా కొండపల్లి సీతారామయ్య, వరవరరావు ఆధ్వర్యంలో పీపుల్స్‌వార్‌లో పూర్తిస్థాయిలో చేరి పార్టీలో కీలక భూమిక పోషించారు. అప్పట్లో ఇదే గ్రామంలో చారుముజుందార్ వర్ధంతి సభతో నక్సల్స్ ఉద్యమం బలపడింది. ఈ తరుణంలో పీపుల్స్ వార్ పార్టీ, అనుబంధ ప్రజానాట్య మండలి విభాగంలో రాష్ట్ర స్థాయిలో అనేక మంది పనిచేశారు. ఎట్టకేలకు ఐదు దశాబ్దాల నక్సల్స్ ఉద్యమ నేపథ్యంలో ఈ గ్రామం నుంచి సంతోశ్‌రెడ్డి అలియాస్ మహేశ్, పైండ్ల వెంకటరమణ, గుమ్ముడవెల్లి రేణుక, పెద్ది శ్రీను, జనశక్తి నేత పెద్ది యాదగిరి ఇతర ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్ పేరిట హతమవడం కొసమెరుపు.

కడవెండికి చేరిన రేణుక మృతదేహం

- నేడు అంత్యక్రియలు
- బంధు, మిత్రులు, మాజీల ఘన నివాళి



రేణుక మృతదేహాన్ని తీసుకువస్తున్న అంబులెన్స్

దేవరుప్పుల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్ముడవెల్లి రేణుక అలియాస్ చైతే అలియాస్ సరస్వతి మృతదేహం మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు ఆమె స్వగ్రామం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండికి చేరింది. బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా, దంతెవాడ నుంచి రేణుక మృతదేహాన్ని ఆమె సోదరులు జీవీకే ప్రసాద్, రాజశేఖర్ స్వగ్రామం తీసుకురాగా గ్రామస్తులు, బంధు, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మూడు దశాబ్దాల క్రితం ఊరు విడిచి అడవి బాటపట్టిన రేణుక విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య గుండెలవిసేలా రోదించారు. పెద్దనాన్న లక్ష్మీనర్సు ఇంటి వేదికగా దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం వద్ద ప్రజల సందర్శనార్థం రేణుక మృతదేహం ఉంచారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, తెలంగాణ రెడ్‌ఫ్లాగ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి రాజేశ్ ఖన్నా, ఓయూ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి.. రేణుక మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు వేర్వేరుగా మాట్లాడుతూ అనారోగ్యంతో నిరాయుధంగా పట్టుబడిన రేణుకను చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని ఆరోపించారు. ఇలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాలకవర్గాలు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.



దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం వద్దకు చేరుకున్న రేణుక మృతదేహం